www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231



తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు


సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :37 | 28-06-2021 | పుటలు : 4


# కోవిడ్ నష్టాల నుండి కోలుకొనే మార్గాలను అన్వేషించాలి

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**21.06.21 (మీడియాసెల్)** కోవిడ్ 19 కారణంగా ప్రపంచంలోని అన్ని రంగాలు తీవ్రంగా నష్టపోయాయని, వాటి నుండి కోలుకునే మార్గాలను ఆర్థికవేత్తలు, వ్యాపారులు, మేధావులు అన్వేషించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ లైఫ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నేషనల్ వెబినార్ నిర్వహించారు. "కోవిడ్-19 ఇంపేక్ట్ ఆన్ ఆక్వాకల్చర్ ప్రాక్టిసెస్" అనే అంశంపై జరిగిన ఈ సదస్సుకు విభాగాధిపతి డా.పి.విజయనిర్మల కన్వీనర్ గా వ్యవహరించారు. ఈ సదస్సునకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ కోవిడ్ 19 కారణంగా రెండు సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాలు కుదేలైపోయాయని వాటి నుండి బయటపడే మార్గాలను నిపుణులు అన్వేషించాలని అన్నారు. ముఖ్యంగా ఆక్వాకల్చర్ పై కోవిడ్ మహమ్మారి ప్రభావం అధికంగా ఉందని, ఆక్వాకల్చర్ రంగంలో ఎదురవుతున్న సమస్యలు మరియు సవాళ్ళును చర్చించే అవకాశం ఈ వెబినార్ ద్వారా లభించిందన్నారు. తీర ప్రాంతాలలోని ఆక్వాకల్చర్, అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవించేవారు అధికంగా ఉన్నారని కోవిడ్ సమయంలో వారు అనేక ఇబ్బందులు పాలయ్యారని చెప్పారు. మార్కెటింగ్, రవాణా, స్టోరేజ్ వంటి కీలక అంశాలతో ముడిపడిన కారణంగా కోవిడ్ సమయంలో అధిక నష్టాలను చవి చూసారని తెలిపారు. కీలకోపన్యాసకులుగా రిటైర్డ్ డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ డా.పొన్నపల్లి రామ్మోహనరావు "కోవిడ్ 19 ఇంపేక్ట్ ఆన్ ఫార్మింగ్ అండ్ మార్కెటింగ్" అనే అంశంపై ఉపన్యసించారు. కోవిడ్ సమయంలో ఆక్వాకల్చర్ రంగానికి ఎదురైన సమస్యలు, సవాళ్ళు, సూచనలపై వక్తలు ఆచార్య పి.హరిబాబు రిటైర్డ్ ఫ్యాకల్టీ ఆఫ్ ఫిషరీ సైన్సెస్ ఎస్.వి.యూనివర్సిటీ, ఆచార్య కె.వీరయ్య ఆక్వాకల్చర్ నాగార్జున యూనివర్సిటీ, డా. బిబా చతియ బోరే, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీ నుండి హాజరై ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య.టి.అశోక్, డా.కె.రమణేశ్వరి, కన్వీనర్ డా.పి.విజయనిర్మల, డా.ఎ.మట్టారెడ్డి,డా.డి.శ్రీధర్, విభాగాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## అన్నదాత సుఖీభవ!!



ఏరువాక పున్నమి

వర్షానికి నేల హర్షిస్తుంది
రైతు స్వేదం పంటవుతుంది
ఆహారమై లోకాన్ని బ్రతికిస్తుంది

రైతన్నల మట్టి పాదాలకు..
కర్షకుల చెమట చేతులకు....
కార్మికుల స్వేద బిందువులకు..
అభివందనం!!!

-నన్నయవాణి.

# జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**21.06.21 (మీడియాసెల్)** జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తులో మానవ మనుగడ సాధ్యమని, ఆరోగ్యంగా జీవించడమే స్థిరమైన అభివృద్ధి అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ లైఫ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. "జీవవైవిధ్యం మరియు ఆరోగ్య సవాళ్ళపై ఆంత్రోపోజెనిక్ ప్రభావం" అనే అంశంపై జరిగిన ఈ సదస్సుకు విభాగాధిపతి డా.పి.విజయనిర్మల కన్వీనర్ గా వ్యవహరించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ వైవిధ్యభరితమైన జాతులు పర్యావరణ వ్యవస్థలతో కలిసి ఉన్నాయని, జీవజాతుల పరిసర వాతావరణం మానవ జీవితంతో సహా విశ్వంలోని అన్ని జీవులకు కేంద్ర స్తంభాలని చెప్పారు. మానవులే జీవవైవిధ్యానికి అపారమైన నష్టాన్ని కలిగిస్తున్నారని ఈ భూమిపై జీవించడానికి అన్ని జీవరాశులకు సమాన హక్కు ఉందని తెలిపారు. దీనిని ఆధునిక మానవులుగా మనం గుర్తించి జీవ వైవిధ్యాన్ని కాపాడుకుంటూ భవిష్యత్తరాలను కాపాడాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అజెండాగా చేసుకొని మానవ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకుంటూ, జీవవైవిధ్య పరిరక్షణకు పాటుపడుతూ ముందుకు సాగుదామని తెలియజేశారు. కీలకోపన్యాసకులుగా క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డి.వి.ఆర్.సాయిగోపాల్ మాట్లాడుతూ గతంలో కూడా అనేక వైరస్ లు మానవునిపై ప్రభావం చూపించాయని వాటికి భిన్నంగా కోవిడ్ వైరస్ తనను తాను మార్చుకుంటూ మరింత వ్యాధికారక వైవిధ్యానికి పరివృత్తన చెందుతుందని చెప్పారు. దాని కారణంగానే 1,2, దశలలో కోవిడ్ మహమ్మారి విజృంభించి ప్రజలను హరించిందని తెలియజేసారు. జన్యుపరంగా అభివృద్ధి చెంది ప్రభావితం చూపుతున్న వైరస్ లపై అధ్యయనాలు జరుగుతున్నాయని చెప్పారు. ఆంత్రోపోజెనిక్ కు సంబంధించి వివిధ రూపాలలో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. అనంతరం వక్తలు ఆచార్య సత్యవేలు రెడ్డి, ఆచార్య ఈ.యు.బి.రెడ్డి, డా.స్వప్నిల్ రాజ్ లు జీవవైవిధ్యం మరియు ఆరోగ్య సవాళ్ళపై ఆంత్రోపోజెనిక్ ప్రభావాలకు సంబంధించిన పలు అంశాలపై ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, విభాగాధిపతి డా.పి.విజయనిర్మల, డా.ఎ.మట్టారెడ్డి, డా.డి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# సంపాదకీయం



## ఆల్కెమీ

ముప్పై ఏళ్ళక్రితం చందమామ పుస్తకంలో కథ. అరణ్యంలో ఉన్న ఆశ్రమంలో అన్ని విద్యలు నేర్పే గొప్ప యోగి. శిష్యులకు వేద వేదాంగాలు నేర్పేవాడు. ఆ యోగికి నీచ లోహాల్ని బంగారంగా మార్చగలిగే విద్య తెలుసును. అంటే స్వర్ణయోగి అన్నమాట. కానీ ఆ విద్య తప్ప తక్కిన విద్యలను విద్యార్థులకు నేర్పి తీర్చిదిద్ది సమాజానికి అందిస్తూ ఉండేవాడు. ఇది తెలిసిన ఒక విద్యార్థి ఎలాగైనా స్వర్ణవిద్య తెలుసుకోవాలని దాని ద్వారానే తాను గొప్పగా సంపాదించుకోవాలని నిర్ణయించుకొని ఆశ్రమంలో చేరాడు. ఎన్ని నేర్పినా, ఎన్నిసార్లు అడిగినా ఆయన స్వర్ణ విద్యను మాత్రం విద్యార్థులకు తెలియజేసేవారు కాదు. ఎందుకంటే అది ప్రమాదకరమని,జీవితానికి సుఖాన్ని ఇవ్వదని తెలియజేస్తూ ఉండేవాడు. చాలాకాలం గడిచిన తర్వాత వయసు రీత్యా వృద్ధుడై తాను ఆరోజు వెళ్లిపోతానని తెలిసి, శిష్యులందరినీ పిలిచి తనకు ఒక ఫలానా పండు తినాలని ఉందని, అదే తన చివరి కోరికని,అది తీసుకురమ్మని అరణ్యంలోకి పంపించాడు. వాస్తవానికి అది ఆయన కోరిక కాదు. ఎవరు లేకుండా తాను ప్రశాంతంగా శరీరాన్ని వదిలి పెట్టాలని ఆయన ఉద్దేశం. ఎలాగైనా స్వర్ణవిద్య నేర్చుకోవాలనుకున్న విద్యార్థి మాత్రం కొద్ది దూరం వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చాడు. గురువుగారి దగ్గర కూర్చుని బతిమలాడాడు, విసిగించాడు. ఎలాగైనా ఆ విద్యను నేర్పాలని పట్టుపట్టాడు. శాంతిని ఆశించిన గురువు దానికి భంగం కలిగిందని గమనించి నాయనా! నీవు ఇప్పటికే కొన్ని విద్యలు నేర్చుకున్నావు. వాటితో నువ్వు చాలా హాయిగా, ఆనందంగా నీ కుటుంబంతో జీవించవచ్చు. ముఖ్యంగా సంతృప్తిగా జీవించగలవు. కానీ నీవు కోరుకుంటున్న ఈ విద్య నీకు దుఃఖాన్ని, ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది, అందువల్ల నేను మీకు ఎవరికీ నేర్పించలేదు. అయినా నన్ను ఈ చివరి క్షణాల్లో విసిగిస్తున్నావు కావున నీకు ఇది నేర్పుతాను. చాలా జాగ్రత్త. అని చెప్పి ఆ స్వర్ణవిద్యకు చెందిన మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ తర్వాత కొద్ది క్షణాలకే ఆయన తన దేహాన్ని వదిలిపెట్టాడు. చాలా సమయం తర్వాత మొత్తం శిష్యులంతా ఆశ్రమానికి చేరి గురువుగారి మరణవార్త విని ఎంతగానో దుఃఖించారు అక్కడే కూర్చుని ఉన్న తమ తోటి విద్యార్థిని అడిగారు ఏం జరిగిందని. గురువుగారు వెళ్ళిపోయే ముందు తాను ఇంక శరీరాన్ని వదిలి పెడుతున్నానని, శిష్యులందరూ వచ్చిన తర్వాత వారు వారు నేర్చుకున్న విద్యలతో ప్రశాంతంగా, సంతృప్తిగా, పదిమందికి ఉపయోగపడే వ్యక్తులుగా సమాజంలో మెలగాలని ఈ మాటను అందరికీ చెప్పాలని నాకు తెలియజేశారని చెప్పాడు. అందరూ గురువు గారికి అపరకర్మలు నిర్వహించి, ఆయన చెప్పినట్లుగానే తమ తమ ప్రాంతాలకు వెళ్లి వారు నేర్చుకున్న విద్యలతో సమాజానికి ఉపయోగపడుతూ సుఖంగా జీవించారు.

స్వర్ణ విద్య నేర్చుకున్న విద్యార్థి మాత్రం ఇంటికి చేరిన తర్వాత వేటిని బంగారంగా మార్చాలని ఆలోచించాడు. ఇంటికి ఉన్న కిటికీ ఊచలు, తలుపు గొళ్ళెం, మేకులు, చిన్నచిన్న ఇనుప సామగ్రి తప్ప ఇంకేమీ కనిపించలేదు. అందుకని తనకున్న కొద్ది ఆస్తిని అమ్మి ఆ డబ్బుతో చుట్టుపక్కల గ్రామాలన్నీ ప్రతిరోజూ తిరుగుతూ "పాత ఇనుము కొంటాం" అని అరుస్తూ రెండేళ్ల పాటు పాతఇనుము కొని తన ఇంటిలోని అన్ని గదులూ నింపేశాడు. ఒకరోజు దాని నంతటినీ బంగారంగా మార్చాలని సంకల్పించుకుని స్నానాదికాలు ముగించి కూర్చుని ఆ ఇనుమును ముట్టుకుని మంత్రాన్ని ప్రయోగించటం కోసం ప్రయత్నించాడు. కానీ అది అతనికి గుర్తురాలేదు. ఎందుకంటే రెండేళ్లపాటు పాత ఇనుము కొంటాం అనే వాక్యమే అతనికి అలవాటై, దానిని సేకరించే పనిలో నిమగ్నమై మంత్రాన్ని మర్చిపోయాడు. పరిపరివిధాల దాన్ని గుర్తు తెచ్చుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు. నేలమీద పడి దొర్లాడు. గంతులు వేశాడు. ఎలా ప్రయత్నించినా అతనికి ఆ మంత్రం గుర్తుకు రాకపోవటంతో పిచ్చివాడై ఆ పాత ఇనుము మీద పడి దొర్లాడు.

ఇదీ కథ. ఏది జీవితానికి సంతృప్తిని, ఆనందాన్ని, ప్రశాంతతను అందిస్తుందో దాని ప్రకారమే మనిషి హాయిగా జీవించగలగాలి. వెనక్కి చూడనంత పరుగు పెట్టడం వల్ల ఒరిగేదేమీ లేదు. సరైన శిక్షణతో, నైపుణ్యంతో పనిచేయటమే ఆనందానికి కారణం. సామర్థ్యం అనేది క్రమపద్ధతిలో లభించే శిక్షణతో కలిసి ప్రావీణ్యంగా మారుతుంది. మనిషి అత్యుత్తమంగా తయారవడానికి, హాయిగా జీవించటానికి సంతృప్తి ప్రధానమైంది. దురాశ ఎప్పుడూ ప్రమాదకరమైందే. మనకు అవసరం లేనిదానిని, మనకా యోగ్యత లేనిదానిని ఆశించటం బలిచక్రవర్తి ముల్లోకాలను ఆశించటం లాంటిదే. సరైన యోగ్యత ఉన్నప్పుడు మాత్రమే ఆయా స్థానాల్లో మనం ఉండగలుగుతాం. అప్పుడే సంతృప్తిగా కర్తవ్యాన్ని నిర్వహించగలుగుతాం. కుటుంబంతో, పదిమందితో ఆనందంగా జీవించగలుగుతాం.

చందమామ కథే అయినా ఎంత గొప్ప సందేశాన్ని అందించింది. కథా రచయిత ఎవరని అడగకండి. ముప్పైఏళ్ల క్రితం మాట. రచయిత గుర్తులేదు. ఆ పుస్తకమూ ఇప్పుడు నా దగ్గరలేదు. కథ మాత్రమే గుర్తుంది.

# పరిపాలన విభాగాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసిన వీసీ



కంప్యూటర్లను ప్రారంభించిన వీసీ జగన్నాథరావు

**23.06.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కేంద్ర పరిపాలన విభాగంలో పరీక్ష విభాగం, ఎస్టాబ్లిష్మెంట్, ఎకౌంట్స్ తదితర విభాగాలకు కంప్యూటర్లు మరియు ప్రింటర్లను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఏర్పాటు చేసారు. ఉభయ గోదావరి జిల్లా ఉన్నత విద్యా కేంద్రంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిపాలన విభాగాల సాంకేతిక సామర్థ్యాలను పెంచి పనిలో నాణ్యతను పెంచేందుకు కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని వీసీ నిర్ణయించారు. దీనిలో భాగంగా బుధవారం ఎస్టాబ్లిష్మెంట్ విభాగంలో వీసీ కంప్యూటర్ ను ప్రారంభించి పరిపాలన విభాగంలో పని చేస్తున్న సిబ్బంది ఈ-ఆఫీసు విధానాన్ని పూర్తి స్థాయిలో సమర్థవంతంగా ఉపయోగించాలని చెప్పారు. భవిష్యత్తులో ఈ-ఆఫీస్ లోనే ఫైల్స్ ముందుకు వెలతాయని కాబట్టి సిబ్బంది అంతా సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తిగా పట్టు సాధించి నాణ్యమైన పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్నారు. విశ్వవిద్యాలయంలో అన్ని విభాగాలకు ఆధునిక సాంకేతిక వసతులనుకల్పించి విభాగాలను భలోపేతం చేయాలనే ఉద్దేశంతో 30 హెచ్.పి కంప్యూటర్లు, 10 ప్రింటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు.క్రమంగా అన్ని విభాగాలకు పూర్తి సాంకేతిక వసతులను కల్పిస్తామని వీసీ తెలియజేశారు. చాలా కాలంగా విభాగాలకు ఉన్న సాంకేతిక అవసరాలను తీర్చిన వీసీకి రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.చంద్రకళ, వెబ్ మాస్టర్ మంచెం శ్రీనివాసరావు, మోటూరి రాఘవులు, సూపరింటెండెంట్ ఎం.ఎస్.భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



రోటర్ క్లబ్ బల్లలను ప్రారంభించిన వీసీ జగన్నాథరావు

**25.06.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ వారు 50 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారని, భవిష్యత్తులో విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకొని మరిన్ని అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని, వారి సేవలు అభినందనీయమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ సభ్యులు సుంకర నాగేంద్ర కిషోర్ సమన్వయకర్తగా, గాదె కిషోర్ ప్రాజెక్టు చైర్మన్ గా ఉంటూ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ పచ్చని ప్రకృతి ఒడిగా ఉండే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు సేద తీరటానికి రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ వారు 50 సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారని వారికి అభినందనలు తెలియజేసారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని అన్ని భవనాల ముందు చెట్ల క్రింద వీటిని ఏర్పాటు చేశామని అన్నారు. విశ్వవిద్యాలయంలోని చెట్లక్రింద విద్యార్థులు సేదతీరే ప్రదేశాలు వారికి చిరకాలం గుర్తుంటాయని, విశ్వవిద్యాలయ జ్ఞాపకాలకు ఇవి చిరునామాగా మారతాయని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ వారు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రాజమహేంద్రవరం అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. ఉభయగోదావరి జిల్లాలకు విద్యా కేంద్రమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలోను రోటరీ క్లబ్ భాగస్వామ్యం కావాలని వీసీ కోరారు. డిస్ట్రిక్ గవర్నర్ నామిని రోటేరియన్ విశ్వనాథం భాస్కర్ రామ్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తామని అన్నారు. విశ్వవిద్యాలయంలోని అన్ని భవనాలకు మంచి నీటిని అందించేందుకు నాణ్యమైన పరికరాలతో, సమర్థవంతమైన నిర్వహణతో విలువైన వాటర్ ప్లాంట్స్ ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విదేశీ విశ్వవిద్యాయాల్లో తమకు ఉన్న పరిచయాల ద్వారా నన్నయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంజనీరింగ్ పూర్తి అయిన తరువాత మాస్టర్స్ చేసేందుకు విదేశీ విశ్వవిద్యాలయాల్లో అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు. రాజమండ్రిలోని రోటేరియన్స్ ద్వారా విశ్వవిద్యాలయానికి అవసరమైన తోడ్పాటును అందిస్తామన్నారు. వీసీ స్పందించి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకొని పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు రోటర్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి ఆధ్వర్యంలో సన్మానం చేసి జ్ఞాపికను అందజేశారు. అలాగే విశ్వవిద్యాలయ అధికారులు రోటేరియన్స్ ను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ప్రెసిడెంట్ ఎన్.జి.శ్యామ్ సింగ్, సెక్రటరీ బి.పవన్ కుమార్, డైరెక్టర్ కమ్యూనిటీ సర్వీసెస్ ఎన్. శివ మల్లికార్జున్, ప్రోజెక్ట్ చైర్మన్ సుంకర నాగేంద్ర కిషోర్, గాదె కిషోర్, కె.పార్థసారథి మరియు విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.



ఎక్కడో పుట్టి
ఎక్కడో పెరిగి
ఇక్కడే కలిశాము....
చదువులమ్మ చెట్టునీడలో....
చదువులు,స్నేహాలు..
విశేషమైన అనుభూతి
జ్ఞాపకాలు!భవితకు మార్గాలు!!
విశ్వవిద్యాలయంలో
వేప,రావి,మర్రి చెట్లక్రింద బెంచీల్లో
కూర్చుని సేదతీరిన
క్షణాలు,చెప్పుకున్న కబుర్లు,నవ్విన
చమత్కారాలు... ఎంత
అమూల్యమైనవి.
రోటరీక్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ వారికి కృతజ్ఞతాంజలి!!

**- నన్నయవాణి.**

# ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కొవిడ్ మృతులకు రూ .1.62 లక్షల ఆర్థికసాయం



రూ . 1.06 లక్షల చెక్కు అందజేస్తున్న దృశ్యం

**23.06.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడలో కొవిడ్ తో మృతి చెందిన అధ్యాపకులు డాక్టర్ టీవీ రమణ , ఆఫీస్ అసిస్టెంట్ బాబూరావుల కుటుంబ సభ్యులకు రూ.1.62 లక్షల ఆర్థిక సహాయాన్ని సోమవారం ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి అందజేశారు. ఆమె మాట్లాడుతూ సిబ్బంది విరాళాల రూపంలో సేకరించిన నగదును టీవీ రమణ కుటుంబానికి రూ.1.06 లక్షలు, బాబూరావు కుటుంబా నికి రూ 56 వేలు అందజేశామని తెలిపారు.

## మంచిమాట

సాకులు వెదకటం,
ఫిర్యాదులు చెయ్యడంలో
చూపే ఓర్పూ,నేర్పూ పనిలో
చూపితే ఎంతైనా
సాధించవచ్చు.

- కార్లయిల్




# ది స్కిల్స్ ఆఫ్ అలక్సా




**26.06.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన "వెబినార్ ఆన్ మిషన్ లెర్నిగ్ – ది స్కిల్స్ ఆఫ్ అలెక్సా" విజయవంతం అయింది. క్యాంపస్ ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి అధ్యక్షతన జరిగిన ఈ వెబినార్ కు ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, కీలకోపన్యాసకులుగా ప్రిన్సిపాల్ టెక్నికల్ ఇంజనీర్ వూన్నా తిరుమలరావు (యు.ఎస్.ఎ), రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ హాజరై ఉపన్యసించారు. అమెజాన్ ఎకో, ది అలాక్సా స్కిల్స్ కిట్, అమెజాన్ అలాక్సా, డెవలపర్ కన్సోల్, వర్కింగ్ ప్రిన్సిపల్స్, అలాక్సా బ్లూప్రింట్స్ వంటి అనేక సాంకేతిక అంశాలపై వివరణాత్మక సందేశాన్నిచ్చారు. యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ విద్యార్థులంతా ఈ ఆన్లైన్ సదస్సును సద్వినియోగం చేసుకున్నారు. ఈ వెబినార్ లో పాల్గొన్న అధ్యాపకులకు, పరిశోధకులకు, విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ తరుపున సర్టిఫికెట్లను అందజేశారు.


## అలక్సా - సాంకేతిక స్నేహితులు



**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**

ఆదిమానవుడు నుండి అంగారకుని చేరే వరకూ మానవుడు సాంకేతిక పరంగా ఎంతో అభివృద్ధిని సాధించాడు. సాంకేతిక అభివృద్ధి అనేది నిరంతర ప్రవాహం దీనిని ఎవరైతే సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుంటారో వారే సాంకేతిక యుగంలో ఉన్నత ఫలితాలను చూస్తారు. మిషన్ లెర్నింగ్ అనేది నేటి కాలంలో అందరికి తెలిసిన విషయమే. మానవుల స్థానంలో మిషన్లు పని చేస్తూ సురక్షితంగా, సులభంగా ఫలితాలను అందిస్తూ మానవ జీవితంలో భాగస్వామ్యం అయ్యాయి. యాంత్రీకరణ ద్వారా సౌకర్యవంతమైన జీవన విధానం అలవర్చుకున్నాం. ఈ క్రమంలో ఆధునిక సాంకేతికపరంగా ఆవిష్కృతమైన మంచి సాంకేతిక మిత్రులు అలక్సా.


## అలక్సా- చిన్న యంత్రం - పెద్ద ఫలితాలు - పనితీరు



**ప్రిన్సిపాల్ టెక్నికల్ ఇంజనీర్ వూన్నా తిరుమలరావు (యు.ఎస్.ఎ)**

అమెజాన్ అలక్సా చిన్న యంత్రం అయినప్పటికి ఎక్కువ ఫలితాలను ఇస్తుంది. దీని పనితీరు మానవుని సామర్థ్యాన్ని పోలి ఉంటుంది. అలక్సా అనేది ఇంట్లో చిన్న వస్తువులాగా ఉంటూ మన నోటితో చెప్పిన మాటలను అర్థం చేసుకొని ఆ ధ్వనిని వ్రాత రూపంలో మార్చుకొని ఇంటర్నెట్ ద్వారా దానికి తగిన సమాధానాన్ని తీసుకొని ఆడియో రూపంలో వినిపిస్తుంది. ఇది కేవలం ధ్వనిని మార్చుకోవడమే కాకుండా ఐ.ఓ.టి పరికరాల పనికి కూడా ఉపయోగిస్తున్నారు. ఇది కేవలం వస్తుల మాదిరిగా కాకుండా మనకు తోడుగా ఉండే చిన్న యాంత్రిక మనిషిగా మన ప్రతీ ప్రశ్నకు సమాధానాన్నిస్తుంది. అలక్సా పనితీరును క్షుణంగా వివరించారు.

## వెబినార్ విజయవంతం



**ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి (కన్వీనర్)**

సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో విద్యార్థులు తమ సాంకేతిక విజ్ఞాన స్థాయిని గుర్తించి దానిని పెంపొందించేందుకు కృషి చేయాలి. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని భావిస్తున్నాం. యువతరం సాంకేతికతను సమాజ హితానికి ఉపయోగించాలి కానీ దుర్వినియోగం చేయకూడదు. విశ్వవిద్యాలయం నిర్వహించిన ఈ వెబినార్ విజయవంతం అయింది. ప్రాంగణ అభివృద్ధి, విద్య, విజ్ఞానాభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న వీసీ మొక్కా జగన్నాథరావు గారికి ధన్యవాదాలు.

# ఆరోగ్య సంరక్షణకు యోగా ఉపయోగం

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**23.06.21 (మీడియాసెల్)** కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణకు యోగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అందరూ యోగాపై పూర్తి అవగాహన పెంచుకొని యోగా చేస్తూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మీడియా సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యశాలను నిర్వహించారు. "కోవిడ్ 19– ఆరోగ్య సంరక్షణలో యోగ" అనే అంశంపై జరిగిన ఈ కార్యశాలకుక కన్వీనర్లుగా డా.తలారి వాసు, పి.ఆర్.వో. పువ్వల ఆనంద్ వ్యవహరించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. శరీరాన్ని మనస్సును ఏకం చేయడమే యోగా ముఖ్య ఉద్దేశమని చెప్పారు. యోగ ఫర్ వెల్ నెస్ థీమ్ తో ఈ ఏడాది యోగాను నిర్వహిస్తున్నామని అన్నారు. కోవిడ్ వంటి భయంకర పరిస్థితుల్లో యోగా ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ప్రాచీన భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాను ప్రపంచ దేశాలు నేడు ఆచరిస్తూ ఫలితాలను చూస్తున్నారని తెలిపారు. యోగాపై అందరూ పూర్తిగా అవగాహన పెంచుకొని ఆచరిస్తే జీవన విధానం పూర్తిగా మారుతుందని ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాడుతుందని తెలియజేసారు. ప్రముఖ యోగా గురువు వి.అశోక్ కుమార్, ఫౌండర్ ఆఫ్ బోధి యోగ అకాడమీ – అమెరికా వారు మాట్లాడుతూ కోవిడ్ నుండి బయటపడటానికి యోగా ఒక చక్కని మార్గమని అన్నారు. యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక శక్తిని పెంచుకొవచ్చని తెలిపారు. శ్వాసపై ధ్యాసను పెట్టడం ద్వారా జీవన స్థితిని మెరుగుపరచుకోవచ్చని తెలియజేసారు. తరువాత యోగా ప్రోటోకాల్ ఆసనాలు విశ్వవిద్యాలయ విద్యార్థులు చండిప్రియ, సత్యకళ్యాణి నిర్వహంచారు. శ్రీరాపర్తి రామ ఇన్సిట్యూట్ ఆఫ్ యోగా, కానవరం నిర్వాహకులు డా.ఎస్.వి.వి.ఎస్.శర్మ, ఎ.శ్యామ్ సుందర్ జలదీప్ ఆసనాలను ప్రదర్శించి యోగా ఔన్నత్యాన్ని తెలియజేసి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, కన్వీనర్లు డా.తలారివాసు, పి.ఆర్.వో ఆనంద్, డా.బాసింశెట్టి రామ గోపాల్, డా.బి.కమలా దేవి (న్యూఢిల్లీ) మరియు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు ఆయా ప్రాంతాల నుండి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# పరిశోధనలపై పట్టు సాధించండి

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**




**26.06.21 (మీడియాసెల్)** నాణ్యమైన పరిశోధనలకు అవసరమైన విజ్ఞాన సామర్థ్యాలపై పట్టు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. "అపర్చునిటిస్ ఆఫ్ రిసెర్చ్ ఫండింగ్ అండ్ టెక్నిక్స్ ఆఫ్ ఎఫెక్టివ్ రైటింగ్ ఆఫ్ రిసెర్చ్ ప్రోపొజల్స్ అండ్ సైంటిఫిక్ పబ్లికేషన్స్" అనే అంశంపై ఈ సదస్సుకు స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి కన్వీనర్ గా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు పరిశోధన కేంద్రాలుగా ఉండాలని, అందరూ పరిశోధనలపై పట్టు సాధించాలని చెప్పారు. శాస్త్రీయ పరిశోధనలో అత్యంత సవాళ్ళుగా ఉన్న అంశాలపై అధ్యయనాలు చేయాలన్నారు. ఇటువంటి పరిశోధన ప్రతిపాదనలు సృజనాత్మకం నుండి శాస్త్రీయ విచారణ యొక్క ప్రతి అంశాన్ని మిళితం చేస్తూ వివరణాత్మక రూపకల్పనకు, డేటా యొక్క అంచనా విశ్లేషణ, ఫలితాల సంశ్లేషణ మరియు బడ్జెట్ అంచనాకు ఉపయోగపడతాయన్నారు. ప్రతిపాదనల కోసం అభ్యర్థనను ప్రకటించడానికి ఏజెన్సీలకు వివిధ కారణాలు ఉన్నాయని వాటికి తగినట్టుగా సామర్థ్యాన్ని విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన సైన్స్ పరిశోధకులుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాన్ని సంపాదించుకోవాలన్నారు. ప్రచురణ యొక్క అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంచి సైన్స్ పేపర్ వ్రాయడం, పరిశోధనా ప్రాజెక్టును సిద్ధం చేయడం వంటి పరిశోధన దృక్పథంతో అధ్యాపకులు ముందుకు సాగాలని తెలియజేశారు. తరువాత పరిశోధనలు, ఫండింగ్, పరిశోధన పత్రాలు, సైన్స్ ప్రచురణలు వంటి అంశాలపై యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఆచార్యులు డా.డి.బి.రామాచారి, సి.ఎస్.ఐ.ఆర్ సీనియర్ సైంటిస్ట్ డా.పవన్ కుమార్, డా.ఎస్.కొండారెడ్డి లు ఉపన్యాసించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, కన్వీనర్ డా.బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆంగ్ల భాషాసాహిత్య నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోండి




**26.06.21 (మీడియాసెల్)** ఆంగ్ల భాషాసాహిత్య నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఆంగ్ల భాషలో రచనలు చేయడం ద్వారా భారతదేశ సాహిత్య ఔన్నత్యం ప్రపంచ దేశాలకు తెలియజేయవచ్చునని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శనివారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆన్ లైన్ సింపోజియం(చర్చా వేదిక)ను నిర్వహించారు. "ఆంగ్లభాష నైపుణ్యాలు మరియు ఆంగ్లంలో సమకాలీన భారతీయ రచనలు" అనే అంశంపై జరిగిన ఈ సదస్సుకు కన్వీనర్లుగా విభాగాధిపతి డా.డి.జ్యోతిర్మయి, ఆచార్య కె.ఎస్.రమేష్, డా.ఎన్.సజనారాజ్ లు వ్యవహరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ వ్యక్తి యొక్క వ్యక్తిగత మరియు వృత్తిపరమైన జీవితాల అభివృద్ధిలో భాష, నైపుణ్యాలు కీలక పాత్రను పోషిస్తాయని అన్నారు. ఈ శతాబ్దంలో సామాజిక, ఆర్థిక సాధ్యతను కలిగి ఉన్న ఆంగ్లభాష అనేక అభివృద్ధి చెందిన దేశాల అధికారిక భాషగా ఉందని చెప్పారు. అటువంటి ఆంగ్ల భాష, సాహిత్యాలపై పట్టు సాధించి ఆంగ్లంలో మంచి రచనలు చేయడం ద్వారా భారతీయ సాహిత్యం ప్రపంచ దేశాలకు తెలుస్తుందని అన్నారు. ఆంగ్లంలో అమూల్యమైన రచనలు చేసి ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఠాగోర్ నుండి చేతన్ భగత్ వరకు ఉదాహరణలతో వివరించారు. ద్రవిడ విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగాధిపతి ఆచార్య సి.హెచ్.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ కళ మాదిరిగానే రాయడంలో నైపుణ్య సాధనతోనే సాధ్యమవుతుందన్నారు. ఇఫ్లూ ఆచార్యులు కె.నరసింహారావు పోస్ట్ మోడర్న్ మరియు పోస్ట్ కలోనియల్ సిద్ధాంతాల మధ్య పోలికను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# బంకించంద్ర ఛటర్జీ జయంతి.. పూర్ణ వందేమాతరం






## బంకించంద్ర ఛటర్జీ

(27 జూన్, 1838 – 8 ఏప్రిల్, 1894) (బెంగాలీ : బంకించంద్ర ఛటోపాధ్యాయ). 'ఛటోపాధ్యాయ్' కు బ్రిటిష్ వారు పలకలేక 'ఛటర్జీ' అని పిలువసాగారు. బ్రిటిష్ వారిని అనుకరిస్తూ ప్రపంచంకూడా 'ఛటర్జీ' అని పిలవడం ప్రారంభించింది. ఈయన బెంగాలీ కవి, వ్యాసరచయిత, సంపాదకుడు. వందేమాతరం మంచి పేరు తెచ్చి పెట్టింది. ఆనంద్ మఠ్ అనే నవలనుండి ఈ గీతాన్ని సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమరశంఖంగా పనిచేసింది.

## సాహిత్య సేవ:


ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యుడు.ఒక్క బెంగలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమ్మిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేశారు. స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహాకవి రచించిన ధేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింపచేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ స్వతంత్ర్యోద్యమంలో సంభవించలేదు.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమం ఒక నిర్ణాయక ఫలసిద్ధి దిశగా చైతన్యవంతమవుతున్నప్పుడు వందేమాతరం గీతం దాని వేగాన్ని త్వరితం చేసింది. వంగదేశంలో కొందరు సాహిత్య విమర్శకులు, ఆధునిక కాలంలో బకించంద్రుడి వంటి నవలా రచయిత ఇంకొకరు లేరంటారు.ఆయన సృష్టించిన పాత్రలు కాల్పనిక సాహిత్యానికి చెందినవే ఆయన సృజనాత్మక సంవేదనలలో ఆయనకాయనే సాటి అని ఆ సాహిత్య విమర్శకుల అభిప్రాయం.ఆయన సాహిత్య ప్రతిభ బహుముఖమైనది.నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యానరచనలో బంకించంద్రచటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు.



నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారిచూపాడు.అంతరాంతరాలలో ఆయనకు పురా భారతీయ సంస్కృతి పట్ల అభిమానం ఉండేదని కొందరు సాహిత్యవేత్తల అభిప్రాయం.యూరొపు మేధావులు, సాహిత్యవేత్తలు భారతీయ తత్త్వ చింతనను సరిగా అర్ధం చేసుకోలేదని వారిపట్ల ఆయనకు ఒక అభియోగం ఉండేదని కొందరు బెంగాలీ సాహిత్య విమర్శకులు భావిస్తారు. ఏమైనా బంకించంద్ర చటర్జీ, రబీంద్రనాథ్ ఠాగోర్ , శరత్చంద్ర చటర్జీ 20వ శతాబ్దిలో వంగ సాహిత్యాన్ని అత్యంత ప్రభావితం చేశారని అజిత్ కుమార్ అనే సాహితీవేత్త అభిప్రాయం.
బంకించంద్ర చటర్జీ రచనలు ఉదాత్త ఆదర్శాలకు, రవీంద్రుని రచనలు కాల్పనిక సౌందర్య తాత్త్వికతకు, శరత్ రచనలు సమాజ వాస్తవికతకు దర్పణాలని ఆయన అంటారు. మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుని పాత్రలు అధిరోహిస్తాయి.

ఉదారాశయాలు, ఉజ్జ్వల భావాలు, ధీరోధాత్త సాహసం, ప్రణయం ఆయన తన నవలలలో చిత్రించారు.అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని ఆయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రునిలో మాతృదేశాభిమానం, ఆరాధన అపూర్వం. ఆనందమఠం నవలలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైనా, సాహసానికైనా వెనిదీయని ప్రతీకలు.




పురాభారతీయ వాఙ్మయంలో ధర్మప్రతిష్ఠాపన, నీతి, ఆదర్శమూ, సత్యమూ, అనుపాలించే పురాణ పాత్రలలాగ బంకించంద్రుని కాల్పనిక, వీర శృంగార, ఐతిహాసిక నవలల్లో ఆయన సృష్టించిన పాత్రలు పాఠకులను సమ్మోహితులని చేసి ఆకర్షిస్తాయి. అట్లా అని ఆ పాత్రలు జీవ చైతన్యాన్ని, వాస్తవిక మూర్తిమత్వాన్ని విస్మరించవు. బహుశా అటువంటి పాత్రలను సృష్టించడానికి ఆయన ఎందుకు పూనుకున్నాడంటే ఆయన సమకాలీన సమాజంలో అటువంటి భావోద్విగ్నతలుగల రచనలే ఆయనకు కనపడలేదు కనుక. అటువంటి సృజనాత్మక చిత్రణ కూడా లేదు. అందువల్ల ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావుకతను, భావుకతా సౌందర్యాన్నీ ఆలంబనం చేసుకొని రచనలు చేశాడని కొందరు సాహితీవేత్తలంటారు.

ఆయన స్త్రీ పాత్రలు సంప్రదాయ జీవిత శృంఖలాల మధ్య నిరాశోపహతంగా జీవించవు. సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతులు, శృంఖలవిచ్ఛేధం, జీవన సహజాత ఉద్వృతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకేమాత్రం తీసిపోరని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు బంకించంద్ర చటోపాధ్యాయను ప్రశంసించారు. నవలా రచనలో ఆయన సృష్టించే సంఘటనలు చదివేవారిని అమితమైన ఉత్కంఠకు లోనుచేస్తాయి. ఇతివృత్త నిర్వహణలో, సన్నివేశ పరికల్పనలో ఆయన సృజనశక్తి, ఆయన ప్రజ్ఞ, ఆయన ప్రతిభ అసదృశమైనవి. ఆయన నవలలు చదువుతుంటే రమణీయ లోకాలలో సంచరిస్తున్న సాహిత్యానుభవం కలుగుతుంది పాఠకులకు. గంధర్వలోకాలలో విహరింపచేస్తాయి ఆయన భావనలు. అలా అని కేవలం కాల్పనిక జగత్తు అనుకోకూడదు ఆయన సాహిత్య సృష్టిని. ఆకాశంలో మబ్బుల గుంపులోను, శతాబ్దాల కింద కట్టిన అతి విశాల గంభీరమైన కోటనో, విశాల వినీల సముద్రతీరాన్నో చూసిన మానవుడికి ఏ ఊహాజగత్తు సాక్షాత్కారమవుతుందో బంకించంద్ర ఛటోపాధ్యాయ రచనలు, ముఖ్యంగా నవలలు అటువంటి మానసికోత్తేజాన్నీ కలగజేస్తాయి.

కేవలం వాస్తవ జగత్తునే సృష్టించటంలో సృజనాత్మక ప్రతిభకు స్థానమెక్కడ ఉంటుంది? జగత్తులోని వాస్తవికతను చిత్రించడం వంటిది కాదు వాస్తవిక జగత్తును చిత్రించటం. కళాకారుడు తన సృజన ప్రతిభలో కృతకృత్యుడవుతాడు. రామణీయకాన్ని ఆవిష్కరిస్తాడు. ఉద్యానవనానికీ, పెరటితోటకూ ఉండే వ్యత్యాసమే మహారచయితకూ, సామాన్య రచయితకూ మధ్య ఉంటుంది. భావుకతా పరమావధిని స్పృశిస్తాయి గొప్ప రచనలు.ఆ కోవకు చెందినవే బంకిం చంద్రుని రచనలు.

## వందేమాతరం

వందేమాతరం
వందేమాతరం

సుజలాం సుఫలాం మలయజ శీతలామ్
సస్యశ్యామలాం మాతరం వందేమాతరం

శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీమ్
ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీమ్
సుహాసినీం సుమధుర భాషిణీమ్
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం



కోటి కోటి కంఠ కలకల నినాద కరాలే
కోటి కోటి భుజై ధృత ఖర కరవాలే
అబలాకేనో మా ఎతో బలే
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదల వారిణీం మాతరం వందేమాతరం

తుమి విద్యా తుమి ధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వంహి ప్రాణా: శరీరే
బాహుతే తుమి మా శక్తి
హృదయే తుమి మా భక్తి
తోమారయి ప్రతిమాగడి మందిరే మందిరే వందేమాతరం

త్వంహి దుర్గా దశ ప్రహరణధారిణీ
కమలా కమలదళ విహారిణీ
వాణీ విద్యాదాయినీ, నమామిత్వాం, నమామి కమలాం
అమలాం, అతులాం, సుజలాం, సుఫలాం,మాతరం వందేమాతరం

శ్యామలాం, సరలాం, సుస్మితాం, భూషితాం
ధరణీం, భరణీం, మాతరం వందేమాతరం
వందేమాతరం

## భావం

జననీ నీకు వందనం! పుణ్యప్రదమైన గంగ, యమునాది జీవనదులను కలిగినదానవు. మధుర ఫల భరితవు. మలయ పర్వతముల నుండి చల్లదనాన్ని పొంది సేదతీర్చే వాత్సల్య పూర్ణవు అయిన తల్లీ! నీకు నమస్కరిస్తున్నాను.

స్వచ్ఛమైన తెలి వెన్నెల చేత పరవశించిన రాత్రులు గలిగి వికసించిన పారిజాత సుమాలతో శోభించే నిత్యమంగళ రూపానివి, దరహాస చంద్రికలతో మాపై ప్రేమామృతాన్ని కురిపించే వాత్సల్య పూర్ణవు. లలిత పద సంభరిత చతురవు అయిన తల్లీ! నీకు ప్రణామములు.

విజయయాత్రా సంరంభోత్సవ సమయంలో అసంఖ్యాక ప్రజల గొంతుకలలో నినదించే జయ జయ ధ్వానానివి నీవు. కోట్లాది భుజాలపై ధరింపబడిన పదునైన ఖడ్గ సముదాయం కలిగిన దానవు. అధికాధిక బల సంపన్నురాలవైన,ప్రచండ శక్తి స్వరూపిణివయిన నిన్ను అబల అని పేర్కొనటంలో ఔచిత్యం లేదు తల్లీ! శత్రు మూకలను సంహరించగల, బలోపేతమైన వీరమాతవు నీవు. ప్రాణికోటి సకల దుఃఖాలను పోగొట్టి తరింప చేయగల దానవు నీవే తల్లీ!

నీవు సమస్త జ్ఞానానివి. ధర్మానివి.సకల జీవకోటిలో చేతనా కేంద్రమైన హృదయ స్థానానివి. సకల జ్ఞాన సంపన్నురాలవు నీవు. సమస్త జీవుల ప్రాణానివి నీవు. మమ్ములను దివ్య బల సంపన్నులుగా పెంచి పోషించే వీరమాత నీవు. అరివీర భయంకరమైన మా భుజాంతర్నిహితమై ఉన్న శక్తివి నీవే తల్లీ! అమ్మా!! మా అందరి హృదయాలలో జనించే భక్తి రూపానివి నీవే. ప్రతి మందిరములోనూ నీ దివ్య మంగళ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుంటాం.

దశవిధ ఆయుధ ధారిని అయిన దుర్గవు నీవు.సకల సంపత్ ప్రదాయిని అయిన లక్ష్మీదేవివి నీవు. పరాపర విద్యా ప్రదాయిని అయిన సరస్వతీ మూర్తివి నీవు. తల్లీ! నీకు అభివాదములు.అనంత ఐశ్వర్య ప్రదాతవు.అనన్య సామాన్యురాలివి. పుణ్య జల పూర్ణవు,అన్నపూర్ణవు అయిన మాతృమూర్తీ! నీకు వందనములు.

సస్యశ్యామలవు, సరళ వర్తనివి, మందస్మిత వదనారవిందవు,సకలాభరణ భూషితవు అయిన మాతృమూర్తీ! విశ్వజననీ! నీకు శతకోటి వందనాలు. శత సహస్ర ప్రణామములు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in